క్లుప్తంగా

పాడి రైతుల ఆందోళన

మునగపాక: తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పునరుద్ధరించాలని సీఐటీయూ కార్యదర్శి ఎస్.బ్రహ్మాజీ కోరారు. ఈ మేరకు నాగులాపల్లి పాల కేంద్రం ఆవరణలో గురువారం పాడి రైతులు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా బ్రహ్మాజీ మాట్లాడుతూ విశాఖ డెయిరీ యాజమాన్యం ఇటీవల తగ్గించిన ఆవు పాల సేకరణ ధరను పెంచాలన్నారు. రైతులకు గత రెండేళ్లుగా బోనస్ ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పొలమరశెట్టి గణేష్, దాడి సత్యనారాయణ, దాడి రామునాయుడు, మళ్ల భాస్కరరావు, కాండ్రేగుల ముసిలినాయుడు, ముచ్చకర్ల సత్తిబాబు పాల్గొన్నారు.

కోలాటం కిట్ల వితరణ



కోలాటం కిట్లు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

కోటవురట్ల: విద్యతో పాటు సాంస్కృతిక కళలూ అవసరమే. ఇందు కోసం ఓ దాత ప్రభుత్వ పాఠశాలకు కోలాటం, చిడతల డ్యాన్స్ కిట్లు అందజేశారు. కొడవటిపూడి ఎంపీయూపీ స్కూల్‌కు అదే గ్రామానికి చెందిన కొంకిపూడి రాజు గురువారం కోలాటం ఆడే కిట్లను బహూకరించారు. ఈ కిట్లను సర్పంచ్ కోసూరు అప్పారావు, హెచ్ఎం కృష్ణప్రసాద్ చేతుల మీదుగా విద్యార్థులకు పంపిణీ చేశారు. విరామం సమయంలో సాంస్కృతిక కళలను ప్రోత్సహించాలని దాత రాజు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ యలమంచిలి శ్రీను, గ్రామస్తులు ఏసుబాబు, మురళి, నానాజీ, కొత్తయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోతురాజుబాబు విగ్రహావిష్కరణ



మునగపాకలో పోతురాజు బాబు విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో గురువారం పోతురాజుబాబు విగ్రహావిష్కరణ ఘనంగా జరిగింది. మరిడిమాంబ అమ్మవారి ఆలయం ఎదురుగా దివంగత దాడి చిన్నయ్య, అప్పలనాయుడు, పరదేశినాయుడుల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు సమకూర్చిన విగ్రహాన్ని స్థానికులు ఆవిష్కరించారు. సర్పంచ్ దిమ్మల అప్పారావు, దాడి ముసిలినాయుడు, దాడి శ్రీరామమూర్తి, దాడి వీరునాయుడు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపు



వాడ్రాపల్లిలో గౌరీ పరమేశ్వరుల విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

మునగపాక: మండలంలోని వాడ్రాపల్లిలో బుధవారం రాత్రి గౌరీపరమేశ్వరుల విగ్రహాల ఊరేగింపు ఘనంగా జరిగింది. త్వరలో జరగనున్న గౌరీ పరమేశ్వరుల ఉత్సవంలో భాగంగా గ్రామస్తులు ఈ భారీ ఊరేగింపు నిర్వహించారు. డప్పు వాయిద్యాల నడుమ నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, పెద్దలు మళ్ల వరహా నరసింగరావు, కొయిలాడ దశావతారం, మళ్ల రాజేష్, నూక అప్పారావు, శేషు, జోగినాయుడు, లీలా భాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి యోగా పోటీలు

నక్కపల్లి: మండలంలో వేంపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు హెచ్ఎం మూలపూరి మూర్తిరాజు ఓ ప్రకటనలో తెలిపారు. ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ పోటీల్లో జిల్లా నలుమూలల నుంచి పలువురు యోగా సాధకులు హాజరు కానున్నారని పేర్కొన్నారు. జిల్లా స్థాయి అండర్-14, అండర్-17 బాల, బాలికల జట్లను కూడా ఎంపిక చేస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో నియోజక వర్గ స్థాయి నుంచి ఎంపికైన సుమారు 300 మంది యోగా విద్యార్థులు, 100 మంది పీఈటీలు, పీడీలు పాల్గొంటారన్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

- కంపు కొడుతున్న కాలనీలు
- మరింత అధ్వానంగా దళిత వాడలు
- అస్తవ్యస్తంగా డ్రైనేజీ వ్యవస్థ
- ఎస్.రాయవరం మండలం వ్యాప్తంగా ఇదే దుస్థితి



రోడ్డుపై ప్రవహిస్తున్న ఇళ్లలో వాడుక నీరు



తిమ్మాపురం దళిత కాలనీలో ఇటీవల వర్షాలకు ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీరు

ఎస్.రాయవరం: క్షీణించిన పారిశుధ్యంతో పల్లెలు సతమతమవుతున్నాయి. మురుగు సమస్యతో అధ్వానంగా తయారయ్యాయి. ఎక్కడపడితే అక్కడ మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడంతో ఇళ్లల్లోని వాడుకనీరు రోడ్లపై ప్రవహిస్తోంది. ఎస్.రాయవరం మండలంలోని 28 పంచాయతీల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా గ్రామాల్లోని దళిత వాడల్లో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఈ కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం మురుగు కూపంగా దర్శనమిస్తున్నాయి. మేజర్ పంచాయతీ తిమ్మాపురంలో దళిత కాలనీ పరిస్థితి అత్యంత దయనీయంగా ఉంది. దార్లపూడి, ఎస్.రాయవరం రెల్లి కాలనీలు, సర్వసిద్ధి, పెనుగొల్లు, పి.ధర్మవరం, పేటసూదిపురం, జేవీపాలెం, ఉప్పరాపల్లి, వాకపాడు, పెదఉప్పలం, పెదగుమ్ములూరు, చినగుమ్ములూరు తదితర గ్రామాల్లోని దళిత కాలనీల్లో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతోంది. వర్షాల సమయంలో సమస్య మరింత జటిలంగా ఉంటోంది. మురుగునీరు నిలిచిపోవడంపై అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త కూడా పేరుకుపోతోంది. తిమ్మాపురం కాలనీ వాసులు జిల్లా కలెక్టర్ ఫిర్యాదు చేస్తే సమస్యను పరిష్కరించకపోగా.. తాత్కాలికంగా తవ్విన కాలువను పంచాయితీ సిబ్బంది కప్పేశారని ఆరోపిస్తున్నారు. అధికారులు అభివృద్ధి నిధులు ముందుగా దళిత కాలనీలకు కేటాయిస్తున్నామని చెబుతున్నారు తప్ప, అక్కడ మాత్రం సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదని స్థానిక ప్రజలు వాపోతున్నారు.



తిమ్మాపురంలో కప్పేస్తున్న తాత్కాలిక కాలువ

ఇప్పటికైనా అధికారులు స్పందించి పారిశుధ్యం మెరుగుకు కృషి చేయాలని కోరుతున్నారు.

దుర్గంధం భరించలేకున్నాం..



మా కాలనీల్లో డ్రైనేజీల నిర్మాణం చేపట్టలేదు. నిత్యం ఎగువ ప్రాంతంలో నుంచి వచ్చిన వర్షంనీరు కిందనున్న తమ కాలనీల్లో నిలిచిపోతోంది. దీనికి తోడు మురుగునీరు కలిసి దుర్గంధం వెదజల్లుతోంది. మరోవైపు దోమల బెడద కూడా ఎక్కువగా ఉంది. వ్యాధుల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– విశ్వాస్ అప్పారావు, తిమ్మాపురం దళిత కాలనీ

మురుగు బయటకు పోలేని పరిస్థితి



గ్రామంలో నిలిచిన మురుగునీరు బయటకు పోలేని పరిస్థితి నెలకొంది. వర్షాలు కురిస్తే ఈ సమస్య మరింత ఎక్కువగా ఉంటోంది. దశాబ్దాలుగా ఈ సమస్య పరిష్కారానికి నోచుకోవడం లేదు. జిల్లా అధికారులకు పదేపదే ఫిర్యాదు చేస్తున్నాం. అయినా పట్టించుకున్న దాఖలాలు లేవు.

– చెక్కా సత్యనారాయణ, నారాయణపట్నం

సమస్యల పరిష్కారానికి చర్యలు

గ్రామాల్లో త్వరలో పర్యటిస్తాం. కాలనీల్లో మురుగునీరు నిలిచిపోతున్న విషయం తమ దృష్టికి రాలేదు. గ్రామాల్లో పర్యటించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.

–సత్యనారాయణ, ఈవోపీఆర్డీ, ఇన్‌చార్జ్ ఎంపీడీవో, ఎస్.రాయవరం

సమన్వయంతోనే అభివృద్ధి సాధ్యం

మునగపాక: గ్రామాల్లో ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిపై దృష్టి సారించాలని ఎంపీడీవో ఎం.ఉషారాణి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో గురువారం సాయంత్రం పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి పథంలో పయనించేలా పాటుపడాలన్నారు. గ్రామాల్లో సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కొత్తగా కార్యదర్శులుగా నియమితులైన వారంతా పింఛన్ల పంపిణీ విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో ఉషారాణి

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఎస్.రాయవరం: కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలో వమ్మవరం, గెడ్డపాలెం గ్రామాలు, కొరుప్రోలు వ్యవసాయ బోర్లకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు అనకాపల్లి ఈఈ రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్‌లో మెయింటినెన్స్ పనుల కారణంగా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు. ఈ మేరకు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి



మధ్యాహ్న భోజన నిర్వాహకులతో మాట్లాడుతున్న డీవైఈవో అప్పారావు

పాయకరావుపేట: విద్యార్థులకు మధ్యాహ్న భోజన మెనూను సక్రమంగా అమలు చేయాలని జిల్లా ఉప విద్యాశాఖాధికారి పి.అప్పారావు ఆదేశించారు. ఆయన గురువారం పట్టణంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం నిర్వాహకులను మెనూ అమలుపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు. పాఠ్యాంశాల బోధనపై ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం డీఎస్ భవానీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుంచి పశుగణన



నక్కపల్లి: జాతీయ స్థాయిలో పశుగణనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రీకారం చుట్టాయి. 21వ అఖిల భారత పశుగణన కార్యక్రమం ఈ నెల 25 నుంచి 28 వరకు అన్ని గ్రామాల్లోనూ ప్రారంభం కానుంది. మూడు రోజుల పాటు జరిగే ఈ పశుగణనలో పశుసంవర్ధక శాఖ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పశుగణనకు సంబంధించిన వివరాలు సేకరించనున్నారు. పాడి రైతులు తమ వద్ద ఉన్న పశువుల వివరాలను గణన కోసం వచ్చే సిబ్బందికి అందించాలని నక్కపల్లి పశుసంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ వీర్రాజు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పశుసంవర్ధక శాఖ ద్వారా వివిధ పథకాల రూపకల్పనకు, టీకాలు తయారీ, మందుల పంపిణీకి ఈ పశుగణన ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఐదేళ్లకొకసారి జరిగే ఈ పశుగణన కోసం వ్యవసాయ, పాడిరైతులు తమ పోషణలో ఉన్న పశువుల వివరాలు తెలియజేయాలన్నారు. డివిజన్‌కు సంబంధించి నక్కపల్లి మండలంలో 8 మంది, ఎస్.రాయవరం మండలంలో ఏడుగురిని ఎన్యూమరేటర్లుగా నియమించామన్నారు.

తీర ప్రాంతంలో ఎంపీడీవో పర్యటన

పాయకరావుపేట: మండలంలోని తీర ప్రాంత గ్రామాల్లో ఎంపీడీవో జయప్రకాష్‌రావు గురువారం పర్యటించారు. పెంటకోట గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. అనంతరం తుఫాన్ షెల్టర్ భవనం, మెరైన్ పోలీసు స్టేషన్, సముద్ర తీరం, లైట్‌హౌస్‌ను పరిశీలించారు. తుఫాన్ సమయంలో తీసుకోవలసిన జాగ్రత్తలపై స్థానిక మత్స్యకారులకు అవగాహన కల్పించారు.



పెంటకోట తుఫాన్ షెల్టర్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీవో జయప్రకాష్‌రావు

కాంట్రాక్టర్లను బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని నిరసన

తుమ్మపాల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న శానిటైజేషన్, సెక్యూరిటీ, వేస్ట్ కంట్రోల్ కార్మికులకు ప్రభుత్వ జీవో 549, కాంట్రాక్టు ఒప్పందం ప్రకారం కనీస వేతనం, పీఎఫ్, ఈఎస్ఐ నెలల తరబడి చెల్లించకుండా కార్మికుల శ్రమను దోచుకుంటున్న కాంట్రాక్టర్లను, వారి లైసెన్స్ రద్దు చేసి బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఉమ్మడి విశాఖ జిల్లా కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక ఎన్టీఆర్ ఆస్పత్రిలో కార్మికుల నిరసన కార్యక్రమం 54వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులకు బకాయి పడ్డ జీతాలు వెంటనే చెల్లించాలన్నారు. మిగతా జిల్లాల్లో మాదిరిగా కనీస వేతనం అమలు చేయాలన్నారు. కార్మిక శాఖ అధికారుల ద్వారా కాంట్రాక్టర్లను అడిగిన ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కార్మిక సంఘ నాయకులు ఎస్.సంతోష్, అద్దా ప్రసాద్, వద్దాది పోలరావు, అడవి రాజు, ఎస్. కిరణ్, కొండపల్లి వరలక్ష్మి, వద్దాది ఉమా, వి.ఎం. నాయుడు, కుంద్రపు వరలక్ష్మి, మహేశ్వరి, ఆర్. జ్యోతి, రామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.



కార్మికులతో కలిసి నిరసన చేస్తున్న ఏఐటీయూసీ నాయకుడు కోన లక్ష్మణ

28 నుంచి విద్యార్థులకు పోటీలు

ఎస్.రాయవరం: బాలల దినోత్సవం పురస్కరించుకుని ఉపాధ్యాయ సంఘాలు విద్యార్థులు పలు పోటీలు నిర్వహించడం అభినందనీయమని ఇన్‌చార్జ్ ఎంపీడీవో జి.సత్యనారాయణ అన్నారు. చిత్రలేఖనం, దేశ భక్తి గీతాలు, పద్య పఠనం, వక్తృత్వం, వ్యాస రచన, క్విజ్, జానపద నృత్యాలు, విచిత్ర వేషధారణలు, తదితర అంశాలపై నిర్వహించే ఈ పోటీల పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించారు. నవంబర్ 14న నిర్వహించే బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 28 నుంచి నర్సీపట్నం ప్రభుత్వ ఉన్నత పాఠశాల వేదికగా పోటీలు నిర్వహించనున్నట్టు పీఆర్‌టీయూ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ఎస్.రాయవరం మండల అధ్యక్షుడు భద్రరావు, సమన్వయకర్త సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ రామారావు, సభ్యులు గారా ప్రకాష్, కొండబ్బాయి, రమేష్ పాల్గొన్నారు.



బాలల పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీడీవో, తదితరులు

‘అభిజిత్’ కార్మికులకు ఉపాధి కల్పించాలి

అచ్యుతాపురం(మునగపాక): ఎస్ఈజెడ్‌లోని అభిజిత్ కంపెనీని తెరిపించాలని కోరుతూ కార్మికులతో కలిసి గురువారం సీఐటీయూ నేతలు అచ్యుతాపురంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రుత్తల శంకరరావు మాట్లాడుతూ అభిజిత్ కంపెనీ యాజమాన్యం లే-ఆఫ్ ప్రకటించడం అన్యాయమన్నారు. కార్మికులతో సంప్రదించకుండా కంపెనీని మూసేయడం తగదన్నారు. వెయ్యి మందికి పైగా ఉద్యోగులు, కార్మికులు రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. గత పది రోజులుగా కంపెనీ మూతపడినా అధికారులు పట్టించుకోలేదన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు. లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు రొంగలి రాము, పలువురు కార్మికులు పాల్గొన్నారు.



అచ్యుతాపురంలో ఆందోళన చేస్తున్న కార్మికులు, సీఐటీయూ నాయకులు

27న జిల్లా స్థాయి చెకుముకి పోటీలు

అచ్యుతాపురం(మునగపాక): అచ్యుతాపురంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 27న జిల్లా స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించనున్నట్టు జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు తెలిపారు. గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు విభాగాలుగా క్విజ్, సైన్స్ ప్రయోగాల పోటీతో పాటు చెకుముకి ట్యాలెంట్ టెస్ట్ నిర్వహిస్తామన్నారు. జిల్లా వ్యాప్తంగా 70 టీమ్‌లు పోటీల్లో పాల్గొంటాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రశాంతి పాలిటెక్నిక్ ప్రతినిధి ధర్మిరెడ్డి ప్రసాద్, జన విజ్ఞాన వేదిక ప్రతినిధి రామ్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటప్పారావు

సైబర్ నేరాలపై అవగాహన అవసరం

కోటవురట్ల: సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ ఎస్.రమేష్ అన్నారు. జల్లూరు జెడ్పీ హైస్కూల్‌లో గురువారం లైంగిక వేధింపులు, నేరాలు-చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సెల్‌ఫోన్ వినియోగం పెరిగే కొద్దీ సైబర్ నేరాలు ఎక్కువయ్యాయన్నారు. మొబైల్స్‌కు వచ్చే లింకులను ఓపెన్ చేస్తే అకౌంట్లలో నగదు మాయమయ్యే ప్రమాదం ఉందన్నారు. బాలికలు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అప్రమత్తంగా ఉండాలన్నారు. లైంగిక వేధింపులు ఎదురైతే ధైర్యంగా తల్లిదండ్రులు, పోలీసులకు తెలిపాలన్నారు. హెచ్ఎం శ్రీనివాసమూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రమేష్

ఉపాధి హామీ పథకంతో గ్రామాల అభివృద్ధి

మునగపాక: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంతో గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. మునగపాక పంచాయతీ కార్యాలయంలో గురువారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా రహదారులు, డ్రైన్లను అభివృద్ధి చేసుకునే అవకాశం ఉందన్నారు. ప్రజలందరి భాగస్వామ్యంతో మునగపాకను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామన్నారు. ఏపీవో శివ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు టెక్కలి పరశురామ్, గ్రామస్తులు దాడి శివ, సూరిశెట్టి అప్పలనాయుడు, కాశీ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్ దొడ్డి గోవింద, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ అప్పారావు

‘ఉల్లాస్’ను విజయవంతం చేయాలి

నక్కపల్లి: గ్రామాల్లో ఉల్లాస్ కార్యక్రమంలో భాగంగా నిరక్షరాస్యత నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో సీతారామరాజు కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఐకేపీ, విద్యా శాఖ సిబ్బందితో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి గ్రామం నుంచి 20 మందిని ఎంపిక చేసుకుని వారికి ఆర్థిక విద్య, డిజిటల్ విద్య నేర్పించాలన్నారు. చదవడం, రాయడంతో పాటు, డిజిటల్ లావాదేవీలను అవగాహన కల్పించాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న మహిళలతో పాటు, నిరక్షరాస్యులను ఎంపిక చేసుకోవాలన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న విద్యావంతులు, గ్రామాల్లో యువకులను, అంగన్‌వాడీ కార్యకర్తలను ఈ కార్యక్రమం కోసం వినియోగించుకోవాలన్నారు. దీనికి ఎటువంటి రెమ్యూనరేషన్ ఇవ్వరని, స్వచ్ఛందంగా సేవ చేయాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవోలు కుంచం నరేష్, వేమగిరి నూకరాజు, వెలుగు ఏపీఎం శ్రీనివాస్, సీడీపీవో శ్రీవిద్య పాల్గొన్నారు.



సమావేశంలోమాట్లాడుతున్న ఎంపీడీవో సీతారామరాజు

బస్సు ఢీకొని పారిశుధ్య కార్మికుడికి తీవ్ర గాయాలు

మునగపాక: మండలంలోని చూచుకొండలో బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో జల్లూరి దేమునికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గణపర్తికి చెందిన దేముడు పంచాయతీ పారిశుధ్య కార్మికునిగా పని చేస్తున్నాడు. బుధవారం రాత్రి చూచుకొండ నుంచి ఇంటికి వెళ్తుండగా ఆర్టీసీ బస్సు ఆయనను బలంగా ఢీకొంది. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన ఆయనను అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విశాఖ కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. ఈ మేరకు మునగపాక పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



క్షతగాత్రుడు దేముడు

‘విద్యార్థుల జీవితాలతో ప్రభుత్వం ఆటలు’

ఎస్.రాయవరం: ఇటీవల అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటోందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.బాలాజీ ధ్వజమెత్తారు. అడ్డురోడ్డు కూడలిలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక విద్యార్థులు గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ ఏడాది విద్యాదీవెన, అమ్మఒడి నిధులు విడుదల చేయకపోవడంతో విద్యార్థులు కాలేజీల్లో ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. అడ్డురోడ్డు ప్రాంతంలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సుమారు 3 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారని, వీరంతా నిరుపేద కుటుంబాలకు చెందిన వారేనని చెప్పారు. ప్రభుత్వంలో ఎన్ని ఇబ్బందులు ఉన్నా విద్యార్థులకు సకాలంలో నిధులు విడుదల చేయాల్సిన అవసరం ఉందన్నారు. వారం, పది రోజుల్లో ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోతే జిల్లా వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చాక అమలుకు ఎందుకు జాప్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సూరి, తరుణ్, రాఘవేంద్రరాజు, సురేష్, శివ, అప్పలరాజు, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



అడ్డురోడ్డులో ఆందోళన చేస్తున్న విద్యార్థులు, ఎస్ఎఫ్ఐ నాయకులు

సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలి

అచ్యుతాపురం(మునగపాక): కార్యకర్తలు సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు కోరారు. మునగపాక, అచ్యుతాపురం మండలాల కార్యకర్తలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శుక్రవారం నుంచి గ్రామాల్లో విరివిగా సభ్యత్వాలు నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు రాజాన రమేష్‌బాబు, ఆడారి మంజు, దొడ్డి శ్రీనివాసరావు, ఆడారి జానకి, కడియం అనురాధ పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి ప్రోగ్రెస్ కార్డుల అందజేత

కశింకోట: మండలంలోని వెదురుపర్తి గ్రామంలో ‘విద్యార్థి మేలుకో’ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వినూత్నంగా స్వీయ అంచనా పరీక్షల ప్రోగ్రెస్ రిపోర్టు కార్డులను ఉపాధ్యాయులు ఇళ్లకు వెళ్లి అందజేశారు. వెదురుపర్తి హైస్కూలు గణిత శాస్త్ర ఉపాధ్యాయుడు ఎ.వి.ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు బోయిన చిన్నారావు, వై.విజయ్ విద్యార్థుల ఇళ్లకు వెళ్లి వారు చదువుతున్న పాఠ్యాంశాలను తెలుసుకున్నారు. వాటిలో సందేహాలను నివృత్తి చేశారు. విద్యార్థుల చదువు తీరును తెలియజేసే ప్రోగ్రెస్ కార్డులో సమాచారాన్ని తల్లిదండ్రులకు వివరించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.